క్లుప్తంగా

'శ్రీరాగా'లో ఘనంగా సైన్స్ ఎక్స్‌పో



ప్రాజెక్టును వివరిస్తున్న విద్యార్థిని

కొత్తగూడెంఅర్బన్: మేదరబస్తీలోని శ్రీరాగా పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో –2023 శుక్రవారం ముగిసింది. విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. మొత్తం– 92 ప్రాజెక్టు నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాజెక్టులను తిలకించారు. కరస్పాండెంట్ మల్లారపు వరప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులను బావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకుగాను సైన్స్ ఎక్స్‌పో నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధ్యాయులు రాంబాబు, సంధ్య, యాస్మిన్, మాధవి, కీర్తి, శ్రీధర్, శ్రీలత, ప్రభాకర్, పూజిత, నాగమణి, అరుణ, సంధ్య, నసీమ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

జూలూరుపాడు: స్థానిక మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ లావుడ్యా సోనీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ, నలుగురు ఎంపీటీసీలు, ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. ఆరుగురు ఎంపీటీసీలు, 22 మంది సర్పంచ్‌లు గైర్హాజరయ్యారు. అదేవిధంగా పలుశాఖల అధికారులు హాజరయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎలాంటి చర్చ, తీర్మానాలు చేపట్టకుండానే సమావేశం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సంతకాలు చేసి వెళ్లిపోయారు.

పీఎల్ఆర్ బోనస్ చెల్లించండి



నినాదాలు చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెర్ఫామెన్స్ లింక్డ్ రివార్డు (పీఎల్ఆర్) దీపావళి బోనస్ వెంటనే చెల్లించాలని, సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని బీఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీలలో ఉత్పత్తి, ఉత్పాదకత లాభాలను సాధించడంలో కాంట్రాక్ట్ కార్మికులు ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. సింగరేణి యాజమాన్యం సీరియస్‌గా తీసుకొని దీపావళి ముందే కాంట్రాక్ట్ కార్మికులకు పీఎల్ఆర్ బోనస్ చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దొడ్డి నిర్మల, పిట్టల శేఖర్, ఎడ్ల రాకేష్, వెంకటేష్, కొమ్ము నాగేశ్వరరావు, శేష సాయి, గుర్రం సృజన్, మంద అజయ్‌కుమార్, అనిత, అశ్విని, సాహిద్ పాల్గొన్నారు.

గ్రామ సంఘాలను పటిష్టం చేయండి



మాట్లాడుతున్న డీపీఎం నాగజ్యోతి

ఇల్లెందురూరల్: గ్రామ సంఘాలను పటిష్టం చేసేందుకు వీఓఏలు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని డీపీఎం నాగజ్యోతి సూచించారు. సెర్ప్ కార్యాలయంలో శుక్రవారం ఆర్థిక కార్యకలాపాలపై వీఓఏలకు అవగాహన సదస్సు నిర్వహించారు. మాట్లాడుతూ.. అంశాల వారీగా ఇప్పటి వరకు సాధించిన ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఓటు హక్కు వినియోగంపై ప్రదర్శన నిర్వహించారు.

మన రాష్ట్రం దేశానికే ఆదర్శం..

జూలూరుపాడు: బీఆర్ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికి ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కారు గుర్తుపై ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ లావుడ్యా సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, పీజీ కృష్ణమూర్తి, చావా వెంకటరామారావు, మూడ్ చిట్టిబాబు, సాయిల నాగేశ్వరరావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, మోదుగు రామకృష్ణ, కొడెం సీతాకుమారి, మంగముడి నాగేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

నెట్ నుంచి నట్టింటికి..

- ఓటర్లకు చేరువయ్యేందుకు సరికొత్త అస్త్రం
- కార్యకర్తలతో వాట్సాప్ సమూహాలు
- అనుచరులకు ఇన్‌చార్జ్ బాధ్యతలు
- అడ్డగోలు పోస్టింగులతో జనం గగ్గోలు



ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో ప్రచారానికున్న అన్ని అవకాశాలను రాజకీయ పార్టీలు అందిపుచ్చుకుంటున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ మందికి చేరువయ్యే సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. తమ పార్టీకి ఎందుకు ఓటు వేయాలో.. తమ అభ్యర్థిని ఎందుకు ఎన్నుకోవాలో.. చెబుతూనే ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ఆరోపణలపై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. సభలు, సమావేశాల్లోనే కాదు.. సామాజిక మాధ్యమాల్లోనూ అసెంబ్లీ పోరు పరస్పర ఆరోపణలు, విమర్శలతో రసవత్తరంగా సాగుతోంది. ప్రస్తుతం అన్ని రాజకీయ పక్షాలు తమ ఎన్నికల ప్రచారానికి సామాజిక మాధ్యమాన్ని ప్రధాన ఆయుధంగా ఎంచుకొని నెట్టింటి నుంచి నట్టింటి వరకు ప్రచారాన్ని ఊదరగొడుతున్నారు. అయితే ఈ పరిణామం నేతలకు ప్రచార ఆయుధంగా మారినా సగటు ఓటరుకు మాత్రం తలనొప్పిగా మారింది.

యువతకు ప్రత్యేక బాధ్యతలు..

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వినియోగం పెరిగిపోయింది. ప్రతి ఇంట్లో ఒకటికి మించి ఉన్నాయి. రోజులో ఎక్కువ సమయం ప్రతీఒక్కరు స్మార్ట్‌ఫోన్ చూడందే ఉండలేకపోతున్నారు. ఏమాత్రం ఖాళీ సమయం దొరికినా స్మార్ట్‌ఫోన్ చూడకుండా ఉండలేకపోతున్నారంటే అతిశయోక్తి కాదు. ఇలాంటి తరుణంలో అన్ని రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నాయి. దీనికోసం ప్రత్యేకంగా చురుకైన యువతకు బాధ్యతలు అప్పగిస్తున్నారు. ప్రతి గ్రామపంచాయతీకి ఒకరు సోషల్ మీడియా ఇన్‌చార్జీలను నియమిస్తూ తమ సందేశాన్ని ప్రజల్లోకి సులువుగా, వేగంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

ఓటర్లకు చేరువయ్యేలా..

ప్రస్తుతం నామినేషన్ ప్రక్రియ ముగిసింది. ప్రచారానికి ఇంకా 20 రోజులే సమయం ఉంది. ఇప్పటి వరకు ప్రచారం అంతంత మాత్రంగా సాగింది. ముఖ్య నేతల సభలు, సమావేశాలు మినహా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో సందడి ప్రారంభం కాలేదనే చెప్పాలి. నవంబర్ 30న పోలింగ్ జరగనుండటంతో మిగిలిన 20 రోజుల వ్యవధిలో అభ్యర్థులు ఓటర్లందరినీ స్వయంగా కలిసి ఓట్లు అభ్యర్థించడం అసాధ్యం. అందుకే సామాజిక మాధ్యమాల ద్వారా నియోజకవర్గంలోని ఓటర్లకు దగ్గరయ్యేందుకు అభ్యర్థులు ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అన్నిస్థాయిలలో ఏర్పాటు చేసుకున్న వాట్సాప్ గ్రూపులు, వాటి నిర్వహణకు ఎంపిక చేసిన సోషల్ మీడియా బృందాలు అభ్యర్థుల ప్రచార చిత్రాలు, వీడియోలను రూపొందించి ఎప్పటికప్పుడు ఆయా గ్రూపులు, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ఓటర్లకు చేరవయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నారు. పంచ్ డైలాగులతో కార్యకర్తల్లో ఉత్సాహం నింపే వాయిస్ క్షణాల్లో అందరికీ చేరిపోతున్నాయి. ప్రచారం, హామీలు, భరోసాలు.. గతంలో చేసిన సేవా కార్యక్రమాలు, లక్ష్యాలు ఒకటేమిటి ప్రతి అంశాన్ని నమోదు చేస్తూ ముందుకు సాగుతున్నారు. ఇంతేకాకుండా నేరుగా అభ్యర్థి వాయిస్ రికార్డింగ్ కాల్స్‌తో ఓటర్లను పలకరిస్తూ.. ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

నిలదీతలకూ ఆయుధంగా..

ఓటర్లకు తమ సందేశాన్ని సులువుగా చేరవేసేందుకు రాజకీయ పార్టీలు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపులను ఆయుధంగా మలుచుకున్నాయి. అంతే స్థాయిలో ఓటర్లు కూడా తామేం తక్కువ తినలేదన్నట్లు.. అభ్యర్థులు గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని సామాజిక మాధ్యమాల వేదికగా నిలదీస్తున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులకు సమస్యలను నేరుగా చూపించి పరిష్కారం అడుగుతున్నారు. ఈ సారి గెలిపించండి... తప్పక పని పూర్తి చేయిస్తామని అభ్యర్థులు హామీలిచ్చి బయటపడాల్సి వస్తోంది.

సందట్లో సడేమియా..

ప్రస్తుత ఎన్నికల సమయంలో కొత్తగా పలు పేర్లతో పుట్టుకొస్తున్న యూట్యూబ్ చానళ్లు, వాట్సాప్ గ్రూపులు కూడా సోషల్ మీడియాను వేదికగా చేసుకొని ప్రచారంలోకి వస్తున్నాయి. తాము సేకరించిన వార్తలు, విశేషాలను జనంలోకి తీసుకెళ్లేందుకు ముందుగా వాట్సాప్ గ్రూపులలో చేరిపోతున్నారు. రాజకీయ పక్షాలు ఏర్పాటు చేసుకొన్ని సోషల్ మీడియా బృందాలకు మిన్నగా సందట్లో సడేమియా అన్నట్లు వీరు చేసే అనుకూల, వ్యతిరేక పోస్టింగ్‌లు అభ్యర్థులకు సైతం తలనొప్పిగా మారుతున్నాయన్న ఆరోపణలు లేకపోలేదు. ఒకే పోస్టింగ్‌ను పదుల సంఖ్యలో గ్రూపులలో పోస్టు చేస్తుండటం సగటు ఓటర్లను ఇబ్బంది పెడుతోంది.

ఇబ్బందైనా తప్పట్లే..

సోషల్ మీడియా వేగంగా విస్తరించడంతో రాజకీయ పక్షాలు వాటిని అందిపుచ్చుకొని తమ సొంత ప్రచారానికి వినియోగించుకుంటున్నాయి. దీనికోసం ప్రధాన పార్టీల నాయకులు తమకు తెలిసిన నంబర్లతో వాట్సాప్‌లలో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. తమ గ్రూపులలో ఎక్కువ మంది ఉన్నారని చెప్పుకోవడానికి వారి వద్ద ఉన్న నంబర్లన్నీ కలుపుతున్నారు. ఏదైనా పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో ఓ వ్యక్తిని యాడ్ చేస్తే ఇష్టం లేకున్నా మోహమాటంతో పోస్టులను చూడలేక, చదవలేక సతమతమవుతున్నారు.

చేసేది లేక పొరపాటున ఎగ్జిట్ అయితే పార్టీ మనిషి కాదని భావించే అవకాశం ఉందని గమ్మున ఉంటున్నారు. ఇక వాట్సాప్ గ్రూపులలో కథనాలు, ప్రచార చిత్రాలు, వీడియోలతో సెల్‌ఫోన్లలో నెట్ డేటా త్వరగా అయిపోతోందని, మళ్లీ డేటా రీచార్జికి ఆర్థిక బారం తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఎన్నికల వేళ వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ప్రచార లొల్లితో తమకు తిప్పలు తప్పడం లేదని ఓటర్లు మదనపడే స్థాయికి సోషల్ మీడియా చేరింది.

అవసరమైనవి చూడలేకపోతున్నాం



సోషల్ మీడియాలో ఎన్నికల ప్రచారం మంచిదే. తక్కువ సమయంలో సమాచారం అత్యధికులకు చేర్చేందుకు ఉపయోగపడుతుంది. కానీ ఇక్కడ పోస్టింగ్‌లు అధికంగా ఉండటంతో అవసరమైన సమాచారం సకాలంలో చూడలేకపోతున్నాం. రాజకీయ నాయకులే నియంత్రణ పాటించాలి.

– రాంచందర్, ప్రిన్సిపాల్, కాకతీయ హైస్కూల్, ఇల్లెందు

విసుగొచ్చేలా పోస్టింగ్‌లు..



ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల ఉండటంతో వాట్సాప్‌లలో పోస్టింగులు బాగా వస్తున్నాయి. ఫొటోలు, వీడియోలను అందుబాటులో ఉన్న అన్ని గ్రూపులలో, పదుల సంఖ్యలో కార్యకర్తలు పోస్టు చేస్తున్నారు. వాటిని చూసేందుకు సమయం, ధనం వృథా అవుతోంది. విసుగు తెప్పించేలా కాకుండా ఆకర్షణీయంగా పోస్టింగులు ఉండాలి.

– దుర్గారావు, ఏపీఎం, ఇల్లెందు మండలం

అరాచకపాలనను అంతమొందించుదాం..



ప్రచారం చేస్తున్న కూనంనేని సాంబశివరావు

పాల్వంచ: పార్టీ కండువాలు మార్చే నాయకులకు ఈ ఎన్నికల్లో ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కాంగ్రెస్, సీపీఎం, టీజేఎస్ బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం మండలంలోని రంగాపురం కాలనీ, గంగదేవిగుప్ప, గొల్లగూడెం, దంతెలబోర, ఎస్సీ కాలనీ, బంధ్రుగొండ, సంగం, నారాయణ రావు, రేపల్లెవాడ, భోజ్యాతండా, నాగారం, నాగారం కాలనీ, బంధ్రుగొండ, కేశవాపురం, జగన్నాథపురం, తోగ్గూడెం, లక్ష్మీదేవిపల్లి తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ పదేళ్లలో డబ్బులు కూడగట్టుకునేందుకు ప్రాజెక్టులను తెరమీదకు తెచ్చి నాణ్యతాలోపంతో నిర్మించారన్నారు. సీపీఐ, కాంగ్రెస్ నాయకులు దయానంద్, కొండెం వెంకన్న, కస్నా నాయక్, మల్లయ్య, రాము, వీసంశెట్టి శ్రీనివాసరావు, మంగయ్య, ముత్యాల విశ్వనాథం, నరాటి ప్రసాద్, వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, బండి నాగేశ్వరరావు, గుండాల నాగరాజు, పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, శనగారపు శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న వెంకటరెడ్డి

జూలూరుపాడు: భోజ్యాతండా గ్రామ పంచాయతీ పుల్లుడుతండాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బానోత్ వెంకట్రామ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 35 కుటుంబాలవారు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, జూలూరుపాడు సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అదేవిధంగా కరివారిగూడెం గ్రామ పంచాయతీ తవిసిగుట్ట తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బోడా భీమారావు, బోడా భాస్కర్‌ల ఆధ్వర్యంలో 20 కుటుంబాలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

వైరాకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు..

శుక్రవారం వైరాలో జరిగిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాలోత్ రాందాస్ నాయక్ నామినేషన్ కార్యక్రమానికి లేళ్ల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జూలూరుపాడు నుంచి కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.

టేకులపల్లి: మండలంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం మండల పరిధిలోని చింతోనిచెలక తండా, సులానగర్, సీతారాంపురం స్టేజీకి చెందిన పలువురు వివిధ పార్టీల కార్యకర్తలు ఇల్లెందు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కోరం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బస్టాండ్ సెంటర్‌కు 'ఎన్నికల కళ'..



కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో జన సందోహం

చుంచుపల్లి: ఎన్నికలొస్తే చాలు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ మార్గం గుండానే ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి నామినేషన్లు వేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు నామినేషన్ల ఘట్టానికి పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్ పార్టీల నాయకులు, నేతలతో సందడిగా మారిందిది. పదిరోజులుగా తమ అభ్యర్థుల నామినేషన్ల కోసం వందలాదిగా తరలివచ్చేవారితో ఆ ఏరియా నిత్యం జనసందోహంగా కళకళలాడుతోంది. ఇక సాయంత్రం వేళల్లోనూ పలు రాజకీయ పార్టీల నాయకులు బస్టాండ్ సెంటర్‌కు చేరుకొని పార్టీల ప్రస్తుత పరిస్థితి.. గెలుపోటముల గురించి ఎవరికి తోచినవిధంగా వారు చర్చోపచర్చలు పెడుతున్నారు.

సర్పంచ్ రాజీనామా

చుంచుపల్లి: పార్టీలో తనకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదని చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ గ్రామపంచాయతీ సీపీఐ సర్పంచ్ బానోత్ పద్మ శుక్రవారం పార్టీకి రాజీనామా చేశారు. ఆమె మాట్లాడుతూ... ఏడేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం పనిచేశానని తగిన గుర్తింపు లేకపోవడంతోనే రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తన రాజకీయ భవిష్యత్‌పై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు.

పాఠశాలకు బీరువా వితరణ

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు దాత ఇనుప బీరువాను వితరణ చేశారు. కాకర్లకు చెందిన సత్యనారాయణ చార్యులు స్మారకార్థం కుమారుడు శ్రీ సౌమిత్రి శ్రీధరాచార్యులు రూ.12,000 విలువ గల ఇనుప బీరువాను శుక్రవారం పాఠశాలకు అందజేశారు. హెచ్ఎం సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభలు

జూలూరుపాడు: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఎలుకలొద్దు, రాంపురంతండా, గుండ్లరేవు గ్రామాల్లో అమరవీరుల సంస్మరణ సభలు నిర్వహించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి ఎస్కే ఉమర్, మండల కార్యదర్శి వల్లోజి రమేష్‌లు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, దేశ విముక్తి కోసం ఎందరో విప్లవకారులు ప్రాణాలు కోల్పోయారన్నారు. అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. సీతారాములు, గలిగె వెంకటేశ్వర్లు, బచ్చల నాగేశ్వరరావు, మడి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ఓడించాలి

పాల్వంచ: ప్రజా, కార్మిక సంక్షేమాన్ని విస్మరించిన బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి జి.రామయ్య అన్నారు. శుక్రవారం స్థానిక కొమరంభీం కార్యాలయంలో ఆర్.మదుసూదన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామయ్య మాట్లాడుతూ.. దేశంలో మోదీ, కేసీఆర్ ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయన్నారు. పది సంవత్సరాలుగా నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫమయ్యాయన్నారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించే చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. షేక్.యాకూబ్ పాషా, గోనెల రమేష్, గోపాలరావు, మల్లెల వెంకటేశ్వర్లు, శేషయ్య పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

ఇల్లెందు నుంచి పోటీకి చివరిరోజు శుక్రవారం పలువురు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటికే ప్రధాన పార్టీల తరుపున, ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు సమర్పించగా.. శుక్రవారం బీఎస్పీ, గోండ్వానా, ఆబాద్ పార్టీల నుంచి ఒక్కొక్కరు, నలుగురు ఇండిపెండెంట్లు తమ అనుచరులతో వచ్చి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ల పత్రాలు అందజేశారు. – ఇల్లెందు



నామినేషన్ దాఖలు చేస్తున్న కోడి నాగరాజు (గోండ్వానా), ఇండిపెండెంట్లు సాయి కుమార్, ముత్తక్క



కాంగ్రెస్ నాయకులు బానోతు స్రవంతి, నాగమణి, విజయలక్ష్మి, ఆరెం విజయ్ చంద్ర (ఇండిపెండెంట్)

చట్ట విరుద్ధ ప్రచారాలపై ఫిర్యాదు చేయొచ్చు



మాట్లాడుతున్న డీపీఆర్ఓ శ్రీనివాసరావు

పాల్వంచ: యాప్ ద్వారా పౌరులు చట్ట విరుద్ధ ప్రచారాలపై ఫిర్యాదు చేయొచ్చని డీపీఆర్ఓ శీలం శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. గూగుల్ ప్లే స్టోర్ నుంచి సీ విజిల్ యాప్‌ను ప్రతీఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని, తద్వారా ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలపై నివేదించడానికి ఈ యాప్‌ను ఉపయోగించుకోవాలన్నారు. చట్టవిరుద్ధ ప్రచార కార్యకలాపాలను పంపడం ద్వారా నిమిషాల్లో సంబంధిత రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లకుండానే వీడియో రికార్డింగ్ ద్వారా రిపోర్ట్ చేయవచ్చన్నారు. వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకుని కచ్చితమైన రిపోర్ట్ తీసుకుని 100 నిమిషాల్లో చర్యలు తీసుకుంటారని చెప్పారు. కంప్లెయింట్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. ఎన్నికల భాగస్వామ్యంలో యువత ఓటింగ్ పర్సంటేజ్ పెరగాలని ఆకాంక్షించారు. స్వీప్ జిల్లా అవేర్‌నెస్ ప్రోగ్రాం అధికారి త్రినాథ్ బాబు, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి బి.సులోచన మాట్లాడుతూ.. 1950 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయడం ద్వారా ఎన్నికల బూత్ వివరాలు ఓటర్ లిస్ట్‌లోని ఓటర్ వివరాలు ఈవీఎం ద్వారా ఏ విధంగా ఓటు వేయాలనే విధానాన్ని వివరించారు. అనంతరం వాల్ ఆఫ్ డెమొక్రసీపై స్లోగన్స్, సంతకాలు చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పాపారావు, ఆర్ఐ హచ్యా, సాంస్కృతిక కళా బృందం సభ్యులు పాగి వెంకన్న, పమ్మి రవి, కుమారి, గురవయ్య, బొమ్మెర ముత్యం తదితరులు పాల్గొన్నారు.

నేను లోకల్.. పిలిస్తే పలుకుతా..



మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేను లోకల్.. నియోజకవర్గంలో పిలిస్తే పలుకుతా.. ఈ గడ్డ వనమా అడ్డా..అని కొత్తగూడెం నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నామినేషన్ వేసిన అనంతరం ఆర్డీఓ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా నియోజకవర్గం అన్ని రంగాలలో ముందుకెళ్తోందన్నారు. చుట్టపుచూపుగా వచ్చే వాళ్లను నమ్మొద్దన్నారు. పంచాయతీ మెంబర్ నుంచి మంత్రిస్థాయి వరకు ఎదగడానికి నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమేనన్నారు. ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధు మాట్లాడుతూ.. వనమాను ఈసారి ఎన్నికలలో అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేసి మరింత అభివృద్ధి సాధించుకుందామన్నారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వనమాను మరోసాని గెలిపించడం ద్వారా మరిన్ని మంచి పనులు జరుగుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు సింగరేణి, తెలంగాణ రెండుకళ్లలాంటివన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రతిపక్షాలను కలవరపెడుతోందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, పినపాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోనేరు సత్యనారాయణ, న్యాయవాది లక్కినేని సత్యనారాణ పాల్గొన్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ముందు మొదట బస్టాండ్ సెంటర్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద వనమా నివాళులర్పించారు.

ప్రజాభీష్టం మేరకే అసెంబ్లీకి పోటీ..



మాట్లాడుతున్న జలగం వెంకట్రావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాభీష్టం మేరకే నామినేషన్ వేశానని మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు అన్నారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ వేసిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నపుడు చేసిన అభివృద్ధి పనులను తామే చేస్తున్నట్లు కొంతమంది ప్రచారం చేసుకోవడం విచిత్రంగా ఉందన్నారు. ప్రజలకు తాను చేసిన అభివృద్ధి ఏమిటో తెలుసునని, వారి కోరిక మేరకే ఎన్నికలలో పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి పోటీ చేస్తున్నానని, తన ఎన్నికల గుర్తు సింహం అని వివరించారు.

రానున్న రోజుల్లో ప్రచారంలో వింతలు జరగబోతున్నాయన్నారు. ఎవరు అభివృద్ధి పనులు చేశారో ఎవరు చేయలేదో ప్రజలకు తెలుసని, తప్పకుండా ప్రజల ప్రోత్సాహంతో విజయం సాధిస్తానని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బానోత్ కేస్లీ, జెడ్పీటీసీ మేరెడ్డి వసంత, మాజీ కౌన్సిలర్ లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్ దారెటు..?



ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో గులాబీ కండువాతో మెట్టెల కృష్ణ, తదితరులు

ఇల్లెందురూరల్: అసెంబ్లీ ఎన్నికల వేల మండలంలో ఒక పార్టీ నుంచి మరో పార్టీకి వలసలు జోరందుకున్నాయి. కార్యకర్తలు ఇలా మారితే పెద్దగా విశేషం ఉండకపోయినా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు కండువా మార్చితే మాత్రం చర్చనీయాంశంగా మారుతుంది. అధికార పార్టీకి చెందిన ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, బొజ్జాయిగూడెం ఎంపీటీసీ శిరోమణి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో గురువారం మధ్యాహ్నం కాంగ్రెస్ పార్టీలో చేరారు. విషయం సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగు చూడటంతో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ హుటాహుటిన జగదాంబగుంపు గ్రామంలోని పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ ఇంటికి తన అనుచరులతో కలిసి రాత్రివేళ ఇంటికెళ్లి బుజ్జగించారు.

ఎట్టకేలకు మెట్టెల కృష్ణ, అతని సతీమణి ఎంపీటీసీ శిరోమణిలకు గులాబీ కండువా కప్పి తిరిగి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. వెనువెంటనే పీఏసీఎస్ చైర్మన్ కృష్ణ తిరిగి బీఆర్ఎస్‌లో చేరినట్లుగా సామాజిక మాధ్యమాలో హల్‌చల్ చేసింది. ఇదిలా ఉండగా బొజ్జాయిగూడెం, సుదిమళ్ల, పూబెల్లి గ్రామపంచాయతీల పరిధిలో బలమైన నేతగా ఉన్న మెట్టెల కృష్ణను తమ పార్టీలోనే కొనసాగించేలా శుక్రవారం ఉదయం కాంగ్రెస్ నేతలు మంతనాలు సాగించారు. ఆ వెంటనే బీఆర్ఎస్ నాయకులు ఏకంగా తమ వెంట ప్రచారానికి తీసుకెళ్లారు. ఇంతకు తాను ఏ పార్టీలో ఉన్నారన్న విషయంపై కృష్ణ స్పష్టమైన వివరణ ఇవ్వకుండా దాటవేత సమాధానం చెప్పడం మండలంలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇరుపక్షాల నుంచి వస్తున్న ఒత్తిడితో ఏం చేయాలో పాలుపోక తన నిర్ణయాన్ని చెప్పుకోలేకపోతున్నాడని స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు.